క్లుప్తంగా

రాష్ట్రాన్ని అప్పుల కుప్ప చేసిన బీఆర్ఎస్

దుబ్బాకటౌన్: సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజాపాలనతోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతోందని, గత బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పులకుప్పగా మార్చిందని కాంగ్రెస్ దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి అన్నారు. సోమవారం రాయపోల్ మండల కేంద్రంలో సోనియా గాంధీ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. అనంతరం ఉపాధి హామీ పథకం ద్వారా సీసీ రోడ్ల పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గొల్లపల్లి కనకయ్య, రాయపోల్, దౌల్తాబాద్ మండల అధ్యక్షులు తప్పటి సుధాకర్, పడాల రాములు, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు పట్నం యాదగిరి, తదితరులు పాల్గొన్నారు. పట్టణంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సోనియా జన్మదినాన్ని నిర్వహించారు. ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు.

ఇందిరమ్మ ఇళ్ల సర్వే నుంచి మినహాయించండి



ఎంపీడీఓకు వినతిపత్రం అందజేస్తున్న పంచాయతీ కార్యదర్శులు

మద్దూరు(హుస్నాబాద్): ఇందిరమ్మ ఇళ్ల సర్వే నుంచి మినహాయింపు ఇవ్వాలని మండల పంచాయతీ కార్యదర్శులు కోరారు. సోమవారం ఎంపీడీఓ రామ్మోహన్‌కు వినతిపత్రం అందించారు. ఇప్పటికే ప్రజాపాలన దరఖాస్తులు, ఆన్‌లైన్ సర్వేలు, డిజిటల్ సర్వేలు, పలు కార్యక్రమాలతో పని భారం అధికమైందన్నారు. దీంతో ఇందిరమ్మ ఇళ్ల సర్వే నుంచి మినహాయించాలని కోరారు. పంచాయతీ రాజ్ శాఖకు సంబంధం లేని పలు రకాల పనులను సైతం చేయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాప్రభుత్వం ఏర్పడి సంవత్సరం గడుస్తున్నా పంచాయతీ కార్యదర్శుల సమస్యలు పరిష్కరించడంతో ప్రభుత్వ విఫలమైందన్నారు. వెంటనే సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

పౌష్టికాహారం తప్పనిసరి



సీమంతం చేస్తున్న సీడీపీఓ జయ

హుస్నాబాద్‌రూరల్: గర్భిణులు ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యం చేయవద్దని, పౌష్టికాహారం తీసుకోంటే తల్లీబిడ్డ ఆరోగ్యంగా ఉంటారని సీడీపీఓ జయ అన్నారు. సోమవారం పొట్లపల్లి అంగన్‌వాడీ2లో సామూహిక సీమంతాలు చేశారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ, మహిళల ఆరోగ్య పరిరక్షణకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారానే పౌష్టికాహారం ప్రభుత్వం సరఫరా చేస్తోందన్నారు. దీనిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్ వైజర్లు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

జిల్లా కార్యవర్గం ఎన్నిక

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): సిద్దిపేట తెలంగాణ వ్యవసాయ అధికారుల సంఘం కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సోమవారం స్థానిక వ్యవసాయశాఖ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో తెలంగాణ వ్యవసాయ అధికారుల సంఘం సిద్దిపేట జిల్లా అధ్యక్షుడిగా భోగేశ్వర స్వామి, ప్రధాన కార్యదర్శిగా నవాత్ సతీశ్‌లను ఎన్నుకున్నారు. కోశాధికారిగా గీత, చైర్మన్‌గా శ్రీనివాస్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా శ్రీనాథ్ పాటుగా ఇతర కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గసభ్యులు మాట్లాడుతూ వ్యవసాయశాఖ అధికారుల సంఘం సభ్యులకు, జిల్లా రైతులకు నిరంతరం అందుబాటులో ఉంటామన్నారు. జిల్లాలో వ్యవసాయ రంగం అభివృద్ధి జరిగేలా సమష్టిగా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ అధికారులు పాల్గొన్నారు.

మహారుద్ర హోమం



నాచగిరిలో రుద్రహోమం నిర్వహిస్తున్న అర్చక, వేదపండితులు

నాచగిరి శ్రీలక్ష్మీనృసింహుని సన్నిధిలో సోమవారం మహా రుద్రహోమం నిర్వహించారు. ప్రజాపాలన విజయోత్సవంలో భాగంగా రాష్ట్రం పురోగతి సాధించాలని ఈ మహాయాగం చేపట్టారు. వేదపండితులు, అర్చకులు పూర్ణాహుతి గావించారు. ఈ సందర్భంగా భక్తులు భక్తిపారవశ్యంలో మునిగితేలారు.

– వర్గల్(గజ్వేల్):

మాజీ సర్పంచ్‌ల నిర్బంధం



బెజ్జంకి(సిద్దిపేట)లో..

పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని కోరుతూ అసెంబ్లీ ముట్టడికి వెళ్తున్న మాజీ సర్పంచ్‌లను పోలీసులు ముందస్తు అరెస్టులు చేశారు. తమ హయాంలో చేసిన పనులకు బిల్లులు ఇవ్వమని అడగడం తప్పా? అని వారు ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదైనా నిధులు విడుదల చేయక పోవడం దారుణం అన్నారు.

– నెట్‌వర్క్



మద్దూరు(హుస్నాబాద్): పోలీసుల అదుపులో మాజీ సర్పంచ్‌లు



హుస్నాబాద్‌రూరల్‌లో..

చెత్త నుంచి సేంద్రియం

- ఇంటింటా తడి, పొడి చెత్త సేకరణ
- స్వచ్ఛతపై ప్రజలకు అవగాహన

చెత్త నుంచి సేంద్రియ ఎరువులు తయారు చేస్తున్నారు. హరితహారం మొక్కలకు వినియోగిస్తున్నారు. దీంతో ఎరువులకు వెచ్చించే భారం తగ్గింది. రైతులకు కూడా అందించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. స్వచ్ఛతపై ప్రజలకు అవగాహన వల్ల గ్రామాలు శుభ్రతను సంతరించుకుంటున్నాయి.



చౌటపల్లి డంపింగ్ యార్డులో వర్మీకంపోస్ట్ యూనిట్‌లో ఆవుపేడను పోస్తున్న సిబ్బంది

అక్కన్నపేట(హుస్నాబాద్): చెత్త నుంచి సేంద్రియ ఎరువులను ఉత్పత్తి చేస్తున్నారు. ఎంపీడీఓ భానోతు జయరాం, ఎంపీఓ గుగులోతు మోహన్‌నాయక్ ప్రత్యేక ప్రోత్సాహంతో అక్కన్నపేట మండలం 'సేంద్రియ ఎరువుల తయారీ' ప్రక్రియ కొనసాగుతోంది. ఉపాధి హామీ పథకం నిధులతో గ్రామాల్లో డంపింగ్ యార్డులను నిర్మాణం చేపట్టిన విషయం తెలిసిందే. అందులో వర్మీ కంపోస్టు యూనిట్ల ఏర్పాటు చేశారు. అలాగే గ్రామాల్లో స్వచ్ఛతపై అవగాహన కల్పిస్తున్నారు. తడి, పొడి చెత్త వేరు చేసి డంపింగ్ యార్డుకు తరలిస్తారు. ప్లాస్టిక్ వ్యర్థాలను పూర్తిస్థాయిలో వేరు చేస్తారు. రోజూ రీసైక్లింగ్ చేసి తడి చెత్తను సేంద్రియ ఎరువులుగా తయారు చేసేందుకు యూనిట్లలో వేస్తారు. అందులో వానపాములను వేస్తారు. 45 రోజుల తర్వాత సేంద్రియ ఎరువుగా మారుతుంది. అనంతరం మొక్కలకు వేస్తారు.

తగ్గిన ఎరువుల భారం

హరితహారం మొక్కల పెంపకానికి సేంద్రియ ఎరువుల భారం తగ్గింది. అక్కన్నపేట మండలవ్యాప్తంగా సుమారుగా 1.5 లక్షల మొక్కలను నాటారు. వాటికి ఎరువులు వేయాలంటే కిలో రూ.35లను వెచ్చించాల్సి ఉంటుంది. అదే డంపింగ్ యార్డులో చెత్తతో తయారు చేస్తున్న ఎరువే వినియోగిస్తున్నారు. మండలంలోని కట్కూర్, చౌటపల్లి, మల్లంపల్లి, అక్కన్నపేట, అంతక్కపేట, రామవరం, గౌరవెల్లి, జనగామ గ్రామాల్లో సేంద్రియ ఎరువుల క్వింటాళ్ల కొలదీ అందుబాటులో ఉంది. రోడ్డుకు ఇరువైపులా నాటిన మొక్కలతో పాటు పల్లెప్రకృతి వనంలో పెరుగుతున్న మొక్కలకు సేంద్రియ ఎరువునే వాడుతున్నారు.

రైతులకు అందిస్తాం



ఇప్పుడు గ్రామాల్లో శుభ్రమైన వాతావరణం ఏర్పడింది. అన్ని గ్రామాల్లో సేంద్రియ ఎరువులను తయారు చేస్తున్నారు. తడి, పొడి చెత్త సేకరణలో గ్రామాల్లో ప్రజల సహకారం బాగుంది. సేంద్రియ ఎరువులు మొక్కలకు వినియోగిస్తున్నారు. రాబోయే రోజుల్లో రైతులకు కూడా వాటిని అందించే దిశగా ప్రణాళికలు చేస్తున్నాం.

– సంజీవ్, పంచాయతీ సెక్రటరీల ఫెడరేషన్ అధ్యక్షుడు, అక్కన్నపేట మండలం

గ్యారంటీల అమలులో ప్రభుత్వం విఫలం

బీజేపీ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు మోహన్‌రెడ్డి

ములుగు(గజ్వేల్): ఆరు గ్యారంటీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బీజేపీ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు గంగిడి మోహన్‌రెడ్డి విమర్శించారు. సోమవారం ములుగులో బీజేపీ మండల అధ్యక్షుడు మన్నె శ్రీనివాస్ ముదిరాజ్ అధ్యక్షతన నిర్వహించిన బూత్ అధ్యక్షుల సమావేశానికి హాజరై మాట్లాడారు. అమలు కాని హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఏడాది పాలనలో ప్రజలకు చేసింది శూన్యమన్నారు. అభివృద్ధి ఒక బీజేపీతోనే సాధ్యమన్నారు. దేశాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు ప్రధాని మోదీ నిరంతరం శ్రమిస్తున్నారన్నారు. జిల్లా ఉపాధ్యక్షుడు కుడికాల రాములు మాట్లాడుతూ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులు అధిక స్థానాల్లో గెలుపొంది సత్తా చాటాలని సూచించారు. మండలంలో నూతనంగా ఎన్నికైన 28 బూత్ అధ్యక్షులకు జిల్లా కార్యదర్శి శశిధర్‌రెడ్డి నియామక పత్రాలను అందజేశారు. మహిళా మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి భాగ్యలక్ష్మి, గజ్వేల్ నియోజకవర్గ కన్వీనర్ సాయిబాబా, మండల ఉపాధ్యక్షులు మహేశ్‌గౌడ్, నర్సింహులు, ప్రధాన కార్యదర్శులు భాస్కర్ యాదవ్, హరికృష్ణ, కోకన్వీనర్ సత్యనారాయణ, నాయకులు ఈశ్వర్ సింగ్, లక్ష్మణ్‌గౌడ్, సుదర్శన్‌రెడి పాల్గొన్నారు.

పశుపోషణతో అదనపు ఆదాయం

విజయ డెయిరీ చైర్మన్ సుదర్శన్‌రెడ్డి



కృత్రిమ గర్భధారణ సర్టిఫికెట్‌ను అందజేస్తున్న సుదర్శన్‌రెడ్డి, వైద్యుడు శ్రీకాంత్‌రెడ్డి

కొండపాక(గజ్వేల్): వ్యవసాయానికి తోడుగా పాడి పరిశ్రమను ఏర్పాటు చేసుకుంటూ మరింత ఆదాయాన్ని పొందాలని విజయ డెయిరీ చైర్మన్ గూడెపు సుదర్శన్‌రెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని సిర్సనగండ్లలో విజయ డెయిరీ ఆధ్వర్యంలో పశుగణాభివృద్ధి సహకారంతో సోమవారం పశువైద్య శిబిరం నిర్వహించారు. కృత్రిమ గర్భధారణతో పుట్టిన దూడలను వైద్యశిబిరంలో ప్రదర్శించారు. ఈసందర్భంగా సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ పశువులకు తప్పనిసరిగా గర్భకోశ చికిత్స చేయించుకోవాలన్నారు. కృత్రిమ గర్భధారణతో బలిష్టమైన దూడలు జన్మిస్తాయన్నారు. జీవాలకు ఎలాంటి సైడ్ ఎఫెక్ట్‌లు ఉండవన్నారు. కార్యక్రమంలో వైద్యులు శ్రీకాంత్‌రెడ్డి, శ్రీనివాస్, సూపర్ వైజర్ సత్తార్, గోపాలమిత్రలు నర్సింహులు, సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్ విక్రయిస్తే కఠిన చర్యలు

కొమురవెల్లి(సిద్దిపేట): మండలంలో ఎవరైనా గానీ డ్రగ్స్ విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ రాజుగౌడ్ హెచ్చరించారు. సోమవారం మండల కేంద్రంలో కిరాణాదుకాణాలు, పాన్‌షాప్‌లు, ఇతర అనుమానిత ప్రాంతాలలో సిబ్బందితో కలిసి ఆయన నార్కోటిక్ డాగ్స్‌తో తనిఖీలను నిర్వహించారు. మండలంలో గంజాయి, ఇతర మత్తు పదార్థాలు ఎవరైనా సరే కలిగి ఉన్నా, విక్రయించినా, రవాణా చేసినా సదరు వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

విద్యార్థి దశ కీలకం

విద్యార్థి దశ చాలా కీలకమని, చదువుకునే సమయంలో ఎలాంటి చెడు తోవలో వెళ్లకూడదని ఎస్ఐ రాజు సూచించారు. సోమవారం మండలంలోని అయినాపూర్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు షీటీమ్ బృందంతో కలిసి ఆయన.. మహిళ రక్షణకు ఉన్న చట్టాలు, గుడ్‌టచ్, బ్యాడ్ టచ్, గంజాయి, ఇతర మత్తుపదార్థాల వల్ల వచ్చే అనర్థాలపై అవగాహన కల్పించారు. అపరిచిత వ్యక్తుల మాటలు నమ్మవద్దని, ప్రేమ పెళ్లి అంటూ జీవితాలు నాశనం చేసుకోవద్దన్నారు. తల్లిదండ్రుల కష్టాలను చూసి ఇష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు ఎదగాలని సూచించారు. ఏదైనా సమస్యలు వస్తే 100కు డయల్ చేయాలని సూచించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ రెడ్డి, షీటీమ్ బృందం సదయ్య, ప్రశాంతి, కృష్ణ పాల్గొన్నారు.

'ఇందిరమ్మ' సర్వేకు సహకారం తప్పనిసరి



హుస్నాబాద్‌రూరల్: మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రజిత

గజ్వేల్: ఇందిరమ్మ పథకం లబ్ధిదారుల ఎంపిక సర్వేకు అంతా సహకరించాలని గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ ఎన్సీ రాజమౌళి కోరారు. సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వార్డుల వారీగా ఈ సర్వే జరగనుందని, తమ వద్దకు వచ్చే అధికారులకు ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నర్సయ్య, వైస్ చైర్మన్ జకీయోద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

అర్హత కలిగిన లబ్ధిదారులను గుర్తించాలి

హుస్నాబాద్‌రూరల్: ఇందిరమ్మ ఇళ్లకు అర్హత కలిగిన లబ్ధిదారులను గుర్తించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ రజిత అన్నారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో ఇందిరమ్మ కమిటీలతో కలిసి ఆమె సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రభుత్వ లక్ష్యం నీరుగారిపోకుండా అర్హులను గుర్తించాలన్నారు. ప్రజాపాలన కార్యక్రమంలో 4,542 మంది దరఖాస్తు చేసుకున్నారని, వాటి పరిశీలనకు గాను 26 మంది సర్వేయర్లను ఏర్పాటు చేశామన్నారు. ప్రతీఇంటికి వెళ్లి వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. 4వ వార్డులో సర్వే ప్రారంభం కాగా మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్ పరిశీలించారు. సర్వేయర్ల సలహాలు సూచనలు ఇచ్చారు.

పేదల సంక్షేమానికి ప్రాధాన్యం

జిల్లా గ్రంథాలయ చైర్మన్ కేడం లింగమూర్తి



సోనియా చిత్ర పటానికి క్షీరాభిషేకం చేస్తున్న లింగమూర్తి

హుస్నాబాద్‌రూరల్: రాష్ట్రాన్ని అభివృద్ధి చేసే బాధ్యత ప్రజలు కాంగ్రెస్‌కు కట్టబెట్టారని జిల్లా గ్రంథాలయ చైర్మన్ కేడం లింగమూర్తి అన్నారు. సోమవారం వంగరామయ్యపల్లిలో కాంగ్రెస్ మండల పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన సోనియా గాంధీ జన్మదినంలో పాల్గొన్నారు. ఇందిరాగాంధీ పేదల సంక్షేమం కోసం అనేక పథకాలను ప్రవేశపెట్టి వారి బతుకుల్లో వెలుగులు నింపారన్నారు. ఇప్పుడు సీఎం రేవంత్‌రెడ్డి పేదలు ఇంటి నిర్మాణం చేసుకోవడానికి రూ.5లక్షల ఆర్థిక సహాయం చేయనున్నారన్నారు. గాంధీ కుటుంబ ఎప్పుడు కూడా పేదల సంక్షేమం దేశ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బంక చందు, సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు చిత్తారి రవీందర్, కౌన్సిలర్లు చిత్తారి పద్మ, సరోజన, రాజు నాయకులు బందెల హరీశ్, రమేశ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

బైకులు ఢీకొని పలువురికి గాయాలు

దుబ్బాకరూరల్: బైక్ మరొక ద్విచక్రవాహనాన్ని ఢీకొన్న ఘటనలో పలువురు గాయపడ్డారు. ఈ సంఘటన మండలంలోని హబ్సిపూర్ శివారులో సోమవారం సాయంత్రం జరిగింది. 108 సిబ్బంది తెలిపిన వివరాలు... దుబ్బాక పట్టణానికి చెందిన గాజుల ధర్మపురి మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలలో గెస్ట్ టీచర్‌గా పని చేస్తున్నాడు. సాయంత్రం పాఠశాలకు బైక్‌పై వస్తున్న క్రమంలో హబ్సిపూర్ వైపు నుంచి అతివేగంగా వచ్చి మనీశ్ బైక్‌తో ఢీ కొట్టాడు. ఇద్దరు బైకిస్టులకు తీవ్ర గాయాలయ్యాయి. మనీశ్ వెనక కూర్చున్న నిఖిల్‌కు స్వల్పంగా గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న 108 సిబ్బంది ఘటన స్థలానికి చేరుకొని ప్రథమ చికిత్స అందించి, సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

చెక్‌బౌన్స్ కేసులో అరెస్టు

సిద్దిపేటకమాన్: చెక్‌బౌన్స్ కేసులో నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ అయిన నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు. సిద్దిపేట టూటౌన్ సీఐ ఉపేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. హనుమాన్ నగర్‌కు చెందిన నరోల్ల రవికుమార్‌పై టూటౌన్ పీఎస్‌లో 2020లో చెక్ బౌన్స్ కేసు నమోదైంది. నిందితుడు 2023, జూన్ నుంచి కోర్టుకు హాజరుకాకపోవడంతో అతడిపై నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేశారు. దీంతో పోలీసులు నిందితుడిని అరెస్టు చేసి సోమవారం కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి.. అతడికి జ్యుడిషియల్ రిమాండ్ విధించినట్లు సీఐ తెలిపారు.

'సీఎం కప్'ను సమన్వయంతో నిర్వహిద్దాం

మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్



సమావేశంలో మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్

సిద్దిపేటజోన్: సీఎం కప్ ట్రోఫీ 2024ను సమన్వయంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిద్దామని మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్ కుమార్ సూచించారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో టోర్నీ నిర్వహణకు సంబంధించి తహసీల్దార్ సలీమ్, ఎంఈఓ రాజాప్రభాకర్, పీడీలు సుజాత, రాజ్ మోహన్‌లతో కలిసి ఆయన సమావేశం నిర్వహించారు. పట్టణ స్థాయిలో భాగంగా కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ విభాగాల్లో పోటీలను నిర్వహించాలన్నారు. సంబంధించిన క్రీడల్లో పురుషులకు, మహిళలకు వేర్వేరుగా ఓపెన్ కేటగిరిలో పోటీ నిర్వహించాలని సూచించారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు ఈనెల 10వ తేదీ ఉదయం 10 గంటల లోపు ప్రభుత్వ ఉన్నత బాలుర పాఠశాల పీడీ సుజాతను సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. వివరాలకు 94402–31033 నంబర్‌లో సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

లారీ పట్టివేత

బెజ్జంకి(సిద్దిపేట): ఓవర్‌లోడ్‌తో వెళ్తున్న ఇసుక లారీని పట్టుకున్నట్లు ఎస్ఐ కృష్ణారెడ్డి తెలిపారు. మండలంలోని గాగిల్లాపూర్ శివారులో గల రాజీవ్ రహదారిపైన సోమవారం వాహనాలను తనిఖీ చేశారు. ఇందులో కరీంనగర్ వైపు నుంచి హైదరాబాద్ వైపునకు అధిక లోడుతో వస్తున్న ఇసుక లారీని పట్టుకున్నామన్నారు. డ్రైవర్లకు డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. ఒకరు తాగినట్లు నిర్ధారణ కాగా కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

సంక్షిప్త వార్తలు

◆ **పోటీలను విజయవంతంగా నిర్వహించాలి**

అక్కన్నపేట(హుస్నాబాద్): ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సీఎం కప్ క్రీడాపోటీలను సమర్థవంతంగా నిర్వహించి, విజయవంతం చేయాలని ఎంపీడీఓ భానోతు జయరాం అన్నారు. మంగళవారం నుంచి మూడు రోజులపాటు జరిగే మండలస్థాయి సీఎం కప్ క్రీడాపోటీలపై అక్కన్నపేట మండల కేంద్రంలోని ప్రజాపరిషత్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. కబడ్డీ, ఖోఖో పోటీలకు వయసుతో సంబంధం లేకుండా క్రీడాకారులు పాల్గొనవచ్చని చెప్పారు. బాలబాలికల విభాగంలో పోటీలు నిర్వహించి ప్రతిభావంతులను ఎంపిక చేసి ఈనెల 16న జరగనున్న జిల్లాస్థాయికి ఎంపిక చేస్తామన్నారు. మండలస్థాయి పోటీలను స్థానిక ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ గుగులోతు రంగనాయక్, మండల క్రీడాలభివృద్ధి అధికారి జంగపల్లి వెంకటనర్సయ్య, పీఈటీలు ఓంప్రకాశ్‌రెడ్డి, లింగేశ్వరి, డేవిడ్, రవి పాల్గొన్నారు.

◆ **నేటి నుంచి సర్వశిక్షా ఉద్యోగుల సమ్మె**

సిద్దిపేటరూరల్: సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మంగళవారం నుంచి సమ్మె చేపట్టనున్నట్లు సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు బాలకిషన్ అన్నారు. నవంబర్ 18న సమ్మె నోటీసు అందజేశామన్నారు. 15 రోజుల గడువు పూర్తి అయ్యిందని, దీంతో సమ్మెకు దిగబోతున్నట్లు తెలిపారు. ఇప్పటికే కలెక్టర్ వద్ద రిలే దీక్షలు చేపడుతున్నామన్నారు. ఈ క్రమంలో 10వ తేదీ నుంచి రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాల్లో కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షుడు, కోశాధికారి, కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

◆ **తహసీల్దార్ కార్యాలయం తనిఖీ**

దౌల్తాబాద్(దుబ్బాక): దౌల్తాబాద్ మండల తహసీల్దార్ కార్యాలయాన్ని అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్ ఆకస్మిక తనిఖీ చేశారు. అనంతరం ఎమ్మెల్సీ నూతన ఓటరు నమోదును పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. ఆయన వెంట డిప్యూటీ తహసీల్దార్ మొహినొద్దీన్, సీనియర్ అసిస్టెంట్ ప్రభాకర్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

◆ **యోగా పోటీల్లో రాణించాలి**

సిద్దిపేటజోన్: ప్రతిభను చూపి జాతీయ స్థాయిలోనూ రాణించాలని జిల్లా క్రీడల శాఖ అధికారి జయదేవ్ ఆర్య సూచించారు. ఈనెల 12 నుంచి 15 వరకు కర్ణాటకలో జరగనున్న జాతీయ స్థాయి యోగా పోటీలకు వెళ్తున్న సిద్దిపేట క్రీడాకారులను సోమవారం అభినందించారు. 18 నుంచి 28 ఏళ్ల విభాగంలో రితమిక్, యోగాసన విభాగంలో సింధురి, మనీషాలు, 45 నుంచి 55 ఏళ్ల విభాగంలో సురేశ్‌లు జాతీయ స్థాయిలో ఎంపికయ్యారన్నారు. యోగా వల్ల ఎన్నో లాభాలు ఉన్నాయని, యోగాకు భవిష్యత్ ఉందని పేర్కొన్నారు. శరీరం దృఢంగా తయారవుతుందని, ఎటువంటి వ్యాధులు దరిచేరవని అన్నారు.

ఘనంగా సోనియా జన్మదిన వేడుకలు

సోనియా గాంధీ జన్మదిన వేడుకలను కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. కేక్‌లు కట్ చేసి, రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు చేసిన గొప్ప నాయకురాలు అని కొనియాడారు. దేశ ప్రజల కోసం ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అమలు చేసిన ఘనత కాంగ్రెస్‌కే దక్కుతుందన్నారు. ఆయా కార్యక్రమాల్లో కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు, అభిమానులు, రాష్ట్ర కాంగ్రెస్ కిసాన్ సెల్ నాయకులు, పాల్గొన్నారు.



మద్దూరు(హుస్నాబాద్)మండల కేంద్రంలో..



చిన్నకోడూరులో సోనియా జన్మదిన వేడుకలు నిర్వహిస్తున్న కాంగ్రెస్ నేతలు



వర్గల్‌లో అంబేడ్కర్ చౌరస్తా వద్ద సోనియా గాంధీ జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేస్తున్న నాయకులు